# ఎందరో మహానుభావులు

అనుబ్రహ్మంగారి కథ



'స్వాగతం....సుస్వాగతం'

....అక్షరాలు సరిగ్గా వ్రాయబడి వున్నాయో-లేవో....ఒక్కసారి చదివి చూసుకొని - తృప్తిపడి హాలులోకి అడుగు పెట్టారు బ్రహ్మంగారు.

అ.ర. సమితి కార్యదర్శి (అంటే అభిలాంధ్ర రచయితల సమితి కార్యదర్శి) పూర్ణానందం 'ఘన స్వాగతం' అంటూ బ్రహ్మంగారితో కరచాలనం చేశాడు.

బ్రహ్మంగారు బదులుగా చిరునవ్వు చిందిస్తూ - అనుమానంగా చుట్టూచూశారు.

హాలునిండా కుర్చీలు అమర్చబడి వున్నాయి. స్టేజిమీద మైక్, ప్రత్యేకాసనాలు వగైరా సిద్ధంగా వున్నాయి. కాని, తామిరువురు తప్ప వేరే ఎవరూ లేరు!

"ఏమిటి సార్! ఎవ్వరూ లేరు. టైమ్ మూడు కావస్తూంది. ఆహ్వానాలలో సాయంత్రం అయిదు గంటలకు సభ ప్రారంభం అన్నాం" ప్రశ్నార్థకంగా చూశారు బ్రహ్మంగారు.

"వస్తారుసార్! రాక ఎక్కడికిపోతారు హైదరాబాదు అందులో నారాయణగూడ. మీకెందుకు భయం. అయినా 'ఇండియన్ పంక్చ్యుయాలిటీ' గురించి మీకు తెలియనిదేముంది? అహ్హాహ్హా" అన్నారు పూర్ణానందంగారు.

బుర్ర వూపారు బ్రహ్మంగారు.

"నమస్కారమండీ!" జాయింట్ సెక్రటరీ ప్రవేశిస్తూ, ఇద్దరికీ కలిపి, ఒక్కటిగా నమస్కరించాడు.

"ఏడండీ - మన కోశాధికారి?" బ్రహ్మంగరు అతన్ని ప్రశ్నించారు.

"అతని ఇంటివద్దనుంచే వస్తున్నానండీ. ఇంట్లో సొరకాయలు కోస్తున్నాడు వాళ్ళావిడకు ఒంట్లో బాగోలేదట. కూర వండేసి ఇప్పుడే వస్తానన్నాడు."

"ఇష్! గట్టిగా అరవకయ్యా - ఎవరన్నా వింటారు. సరే - నువ్వెళ్ళి ప్రార్థన పాడే కోకిలమ్మను రెడీగా వుండమను. లీడర్ దాసుగారు అయిదు గంటలకల్లా వచ్చేస్తారు"

"అలాగే" అంటూ ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడు జా.సె.

"అన్నట్టు ఆహ్వానాలు అందరికీ వెళ్ళాయి కదండీ" బ్రహ్మంగారు పూర్ణానందంగారిని ప్రశ్నించారు.

"ఎంత మాట సార్! ప్రెసిడెంట్ గారైన మీ కవితల్ని లీడర్ దాసుగారికి అంకితమిచ్చే సందర్భంలో....అమ్మమ్మ ఒక్కడినైనా వదలిపెడతానండీ! అందరికీ పంపించాను."

"మరి ఎవడూ రాలేదేం?"

"వస్తారు సార్! నెమ్మది నెమ్మదిగా వస్తారు. అదిగో....చూడండి ఎవరో

వస్తున్నారు....చచ్చాను....చూడకండి.... సార్! సార్! ఆ వచ్చే అతనికి నాఒంట్లో బాగోలేదని, నేను లేనని చెప్పండి సార్! ప్లీజ్....'' -బ్రహ్మంగారు ఏదో అడుగుతున్నంతలోనే చటుక్కున తలవంచుకుని కుర్చీలప్రక్కనుండి మెల్లగా వంగి వంగి నడుస్తూ బాత్‌రూంవైపు వెళ్ళిపోయాడు పూర్ణానందం.

''ఎవరు కావాలండీ'' బ్రహ్మంగారు ఆగంతకుడ్ని ప్రశ్నించారు.

''పూర్ణానందం లేడాండి.''

''ఆ య నా....ఆయనకు....ఒ ం ట్లో బాగోలేదట....రాలేదండి'' ఇబ్బందిగా చెప్పారు,

''ఇక్కడేం చేస్తున్నారు-ఏదో సభలా వుందే'' కళ్ళజోడు సర్దుకుంటూ ఆయన ప్రశ్నించాడు.

''అవునండి— లీడర్ దాసు గారిప్పుడు వస్తారు.''

''అలాగా....అయితే తప్పక వుండాల్సిందే'' అంటూ ముందున్న కుర్చీలో కూర్చున్నా రాయన.

దూరంగా కిటికిలోంచి చూస్తున్న పూర్ణానందం గుండెలో రాయి పడింది. బ్రహ్మంగారి వైపు ఆయన సైగ చేశాడు.

బ్రహ్మంగారు ఆ ప్రక్కగా వెళ్ళారు. ''ఏం పని చేశారు సార్?''

పూర్ణానందం ప్రశ్న అర్ధంకాక ఏమిటన్నట్లు చూశారు బ్రహ్మంగారు.

''ఆయనకి నేనొక ఏభై రూపాయలివ్వాలి సార్....వెధవ....ఇక్కడికీ తగలడ్డాడు. ఈ సభ సభ్యులకు మాత్రమే అని చెప్పండి. మన అ. ర. సమితిలో సభ్యుడిగా చేరాలంటే ''పూర్తి పేరమ్'కు పది రూపాయలు కట్టాలని చెప్పండి. వెంటనే పారిపోతాడు.''

పూర్ణానందం ప్లాన్ ఫలించి ఆగంతకుడు వెళ్ళిపోయినా, బ్రహ్మంగారు అదొక అపశకునంగా భావించి మదనపడసాగారు.

టైమ్—మూడున్నర అయింది.

కోశాధికారి జారిపోతున్న పంచె కట్టును సరిచేసుకుంటూ ప్రవేశించాడు ఆయనతో అ. ర. సమితి స్థాపకవర్గం పూర్తిగావచ్చినట్లే. ఇక సభికులగురించి ఆందోళన మొదలైంది.

బ్రహ్మంగారు అటూ—ఇటు తిరగసాగారు.

మిగతా కార్యవర్గం వారు కూడా. సభికులు ఇంకా ఎందుకు రావడం లేదోనని—ఆలోచించడంలో నిమగ్నులైపోయారు.

ఈ హడావుడిలో కోకిలమ్మగారి ప్రవేశాన్ని ఎవరూ గమనించలేదు. అయినా ఇలాంటి వాటన్నిటికీ బాధపడితే ఆతర్వాత కార్య క్రమాల్లో-ప్రార్ధన, జనగణమన—

పాడడానికీ, ఫోటోలు తీయించుకోవడానికీ అవకాశం దొరకద్దూ? అందుకని ఆమె మెదలకుండా ఒకమూల కూర్చొంది.

"ఆరేయ్ బ్రహ్మం."

అసాధారణమైన ఆ పిలుపుకు బ్రహ్మం గారు పులిక్కిపడ్డారు. ఎదురుగా తన ప్రియ మిత్రుడు చిట్టిబాబు.

"హలో... చిట్టిబాబు.... మై డియర్ పొట్టిబాబు-భలేగట్టి...."

"చాలురా....నాయనా....చాలు నువ్వు కవిబ్రహ్మవవుతావని నేను ఎప్పుడో చెప్పాను కదరా....అది సరే....ఏదీ సభ తాలూకు వాతావరణం" చుట్టూ చూశాడు చిట్టిబాబు.

"తొందరపడకు మరి" అంటూ తన అ. ర. సమితి కార్యవర్గాన్ని మొదట పరిచయం గావించాడు.

"హారేయ్ బ్రహ్మం! మొత్తం మీద నేను రాత్రి బండికి విజయవాడ పోయేదలా చూడు. నీ కోసం నా ఆఫీసుపని తొందరగా ముగించుకు వచ్చేశాను."

"అబ్బాయ్! అదే నీతో వచ్చిన చిక్కు. చాలాకాలానికి కలుసుకున్నాం. అందులోనూ ఇల్లాంటి ముఖ్యమైన సందర్భంలో నువ్వు ఆఫీసుపని మీద రావడం. నేను నిన్ను పట్టుకోవడం - ఓహ్! నాకు చాలా సంతోషంగా ఉందనుకో. . ఇదిగో




ఇక్కడ కూర్చో. కార్యక్రమం అయ్యేక విన్ను బండి ఎక్కించే పూచీ నాది.''

చిట్టిబాబు చుట్టూ చూస్తూ కూర్చు న్నాడు.

దాదాపు పదిమంది వరకు సభికులు వచ్చి చేరారు.

మయం నాలుగున్నర అయింది.

పూర్ణానందం ప రు గె త్తు కు ం టూ వచ్చాడు. సార్....సార్....ఎమ్. ఎల్ ఎ గారు 'ఫోన్' చేసి అందరూ వచ్చారా?'' అని అడిగారు' ''అందరూ వచ్చారు. మీరే వెంటనే రావాలి'' అని చెప్పాను.

''అసలు దాసుగారే ఇంకా రాలేదు కదా''బ్రహ్మంగారికీ సందేహంచెబుతాం''

బ్రహ్మంగారు తల ఆడించారు.

అయిదయినా సభికులు పదినుండి పెరుగక పోయేసరికి బ్ర హ్మం గా రు గాభరా పడసాగారు.

లీడర్ దాసుగారు బయలుదేరారని 'ఫోన్' చేస్తే తెలిసింది.

పూర్ణానందంగారి చె వి లో ఏదో చెప్పారు. ''తప్పదా'' అన్నట్లు ఆయన మొహం అదోలా పెట్టి 'సరే' అన్నారు. పావుగంటలో ఒక కలర్ బాటిల్స్' బండి వచ్చి ఆ హాలు ముందు ఆగింది.

పూర్ణానందం పుణ్యమా అని అయిదారు గురు దారిన పోయే వానయ్యలు దాహం తీరి లోపలికి వచ్చి కూర్చున్నారు. కలరులు కొట్టి ఒక్కొక్కళ్ళకు ఇవ్వడం-బయటి బయటినుండి చాలా మంది చూశారు, లోపల అప్పటికే ముందుగా కూర్చున్న సభికులు ఏదో మరచి పోయినట్లుగాఅక్క డకు వచ్చి వాళ్ళ తల కొకటి రుచి చూశారు,

సభికుల సంఖ్య పదిహేనుకు పెరి గింది.

సీసాలు ఖాళీ అవుతున్నకొద్దీ హాలు హాలు భర్తీ కాసాగింది.

బ్రహ్మంగారు తృ పి పడ్డారు. అయితే వెంటనే ఇంకొక ప్రమాదాన్ని ఆయన ఎదుర్కొనవలసి వచ్చింది. అయిదున్నరై ఇంకా కొద్ది సేపటిలో నాయకులు వస్తునా రనగా 'కలరు' రుచి చూసిన వాళ్ళు నెమ్మ దిగా ఒకరి తర్వాత ఒకరు జారుకో సాగారు.

పూర్ణానందం తెల్ల మొహం వల్ల బడింది.

అయితే పూర్ణానందం అనుభవజ్ఞుడు. ఆశావాది. అందుకే మళ్ళా బ్రహ్మంగారి చెవులకు, బుర్రకు పని చెప్పాడు.

బ్రహ్మంగారి హాంకారం జవాబుగా భావించి, పూర్ణానందం పరుగుతీసి-పదినిమి షాలలో 'మిక్చర్' పొట్లాల సరంజా మాతో వచ్చాడు. బయటకు పోతున్న వాళ్ళకు అవి కనబడేలా ప్రదర్శించాడు.

అనుకున్నట్లే అది 'అయస్కాంతం'లా పనిచేసింది.

అయితే పూర్ణానందం బుర్ర ఈసారి 'పాదరసం' అయికూర్చుంది. "సభ ముగి శాకే పొట్లాలని-దయచేసి తమరు సహక రించాలని" పొట్లాల వైపు ఆశగా చూస్తున్న వాళ్ళకు విన్నవించుకున్నాడు.

పూర్ణానందంమాటలు వాళ్ళకు నచ్చాయి అందరూ బుద్ధిగా కూర్చున్నారు.

ముందుగా ఎమ్. ఎల్. ఎ. బోసుగారు వచ్చారు. వెనువెంటనే 'లీడర్ దాసు'గారు వచ్చారు. సభ ప్రారంభమైంది.

"అ. ర. సమితి" ఉద్దేశ్యాలు-ప్రగతి వగైరాల గురించి. ఇంటి దగ్గర చక్కగా తయారు చేసుకున్న ఇంగ్లిషు ప్రసంగాన్ని కార్యదర్శి పూర్ణానందం చదవడానికి ఉద్యుక్తుడియ్యాడు.

సభలో కొంత గందరగోళం బయలు దేరింది.

"తెలుగు....తెలుగు....తెలుగులో ఏడ వండి....తెలుగుజిందాబాద్" అని కొన్ని గొంతుకలు సభలోంచి.

"సప్లిమెంటరీ క్వొశ్చన్ సార్" అని ఎమ్. ఎల్. ఎ బోసుగారు అనేసి నాలు క్కారు కున్నారు-ఆయన అసెంబ్లీ నుండి వచ్చేసిన సంగతి మర్చిపోయి.

"సరే సార్....తెలుగులోనే మాట్లా డండి" బోసుగారు కూడా అనేటప్పటికి పూర్ణానందం గొంతులో పచ్చి వెల క్కాయ పడినంత పనయింది.

"సోదరీ సోదర మణులారా....మీ భాషాభిమానానికి నాకు చాలా సంతోషంగా వుంది. అవును....మన తెలుగులోనేమంచి "ఇది వుంది...."

"ఏమిటా ఇది...." సభలో కల కలం.

"అదే....ఇదంటే....అ దే....మ న తెలుగుయొక్క ఇది!...." అ లా గే ప్రసంగం కొనసాగించాడు పూర్ణా నందం.

చిట్టిబాబు నవ్వు నాపుకొంటూ బ్రహ్మం గారి వైపు చూశాడు.

బ్రహ్మంగారు దూరంగా ఎవరో ఫోటో గ్రాఫర్' ఏంగిల్‌కోసం - చూసు కొంటుంటే—తను తిన్నగా కూర్చు న్నాడు-ఏదోనని సరిచూసుకో సాగారు.

జాయింట్ సెక్రటరీ కోకిలమ్మవైపు చిత్తుగా చూస్తూ—మత్తుగా నవ్వ సాగాడు.

కోశాధికారి వాళ్ళావిడకోసం.మందులు కొనడానికి డబ్బు—ఎక్కడ ఎవరి దగ్గర దొరుకుతుందోనని ఆలోచించసాగాడు.

లీడర్ దాసుగారు తను పాల్గొనబోయే తర్వాత సమావేశంలో ఏం చెప్పాలా అని నుదుటినీ తలను కుడిచేత్తో ఇస్త్రీ చెయ్యసాగారు.

ఎమ్. ఎల్. ఎ. బోసుగారు ఆవలిస్తూ కొద్దిగా తాము కూర్చున్న కుర్చీకి జేర బడ్డారు.




సభికుల్లో చాలా మంది ముందు కలర్ ఇచ్చి తర్వాత మిక్చర్ ఇవ్వబోవడ మేమిటని ఆ కారణాన్ని వెదకడంలో బుర్ర పదును చేసుకోసాగారు.

కార్యదర్శి ప్రసంగం అయింది.

బ్రహ్మంగారు తన సుడిగాలి. 'కవితా సంకలనాన్ని - 'లీడర్ దాసు' గారికి అంకితమిస్తున్నట్లు ప్రకటించి. ఒక ప్రతి సమర్పించగానే సభికులంతా చప్పట్లు కొట్టారు.

మాంసం ముక్కలకు ఎదురు చూస్తున్న కాకుల్లా, ఇద్దరు ఫొటోగ్రాఫర్లు చటుక్కున మెరుపులు మెరిపించారు.

లీడర్ దాసుగారు ప్రసంగం ప్రారంభించారు.

"బ్రహ్మంగారి నవల సుడిగాలి' చదివాక....నాకు చాలా,

"నవల కాదు సార్....కవితలు....కవితలు....', సెక్రటరీ నెమదిగా గొణిగాడు.

"ఆ....అదే....ఆయన కవితలు చదివాక....అదొక గొప్ప నవలగా భావించాము. అది ఆయన నాకు అంకిత మివ్వదలచుకొన్నట్లు చెప్పగానే....నాకు పరమానందమైంది"

జాయింట్ సెక్రటరీ చప్పట్లు చేస్తూ-సభికులవైపు చూశాడు. అంతే మరుక్షణం కరతాళ ధ్వనులతో హాలు మారుమ్రోగింది.

లీడర్ దాసుగారులేచి నమ్రతతో అందరికీ చేతులు జోడించి బ్రహంగారి వైపు తిరిగి నవ్వు మొహంతో తన ప్రసంగాన్ని కొనసాగించారు.

ఎమ్. ఎల్. ఎ బోసుగారి వంతు వచ్చింది.

వెంటనే ఆవేశమైన దోరణిలో ఆయన ఉపన్యాసం మొదలు పెట్టారు.

"సోదర సోదరీ మణులారా....మన దేశం ఆర్థికంగా వెనుకబడివున్నదంటే-అందుకు కారణం ఒక్కొక్క భార్యా భర్తలకు అయిదారుగురేసి భార్యా భర్తలు సారీ....ఐమీన్... పిల్లలు వుండటమే. అలా కాకుండా....ఇద్దరులేక....ముగ్గరు పిల్లలు....ఆ ముగ్గురు కూడా కాదు....ఇద్దరే....ఇద్దరు,"

వేదికపై నున్నవారు, సభికులు గాభరా పడసాగారు ఎమ్ ఎల్. ఎ. గారి సెక్రటరీ....బ్రహ్మంగారి పుస్తకాన్ని బోసుగారికి కనబడేలా....చేతులు వూపుతూ ఒక ప్రక్కనుండి....అటూ ఇటూ వూపసాగాడు.

బోసుగారు తన బండి 'లూప్‌లైన్'లో పోతుందని గ్రహించారు. అయితే అదేమంత పెద్ద ప్రమాదం కాదు వారికి.

"....ఇలా....యెందుకు చెబుతున్నానంటే....ఎనెన్నో కవిత్వాలు ప్రయోజనం లేనివి....ప్రతీవారి దగ్గర్నుంచి పుట్టుకొచ్చేస్తున్నాయి. కాని బ్రహ్మంగారి 'సుడిగాలి' లాంటివి రెండు మూడు చాలు....మన సాహిత్యం అభివృద్ధి చెందడానికి."

జా. సె. మళ్ళా మెరుపులా చప్పట్లు కొట్టి-అందరిచేత చరిపించాడు.

బ్రహ్మంగారు .నిట్టూర్చారు.

ముందుగా కూర్చున్న చిట్టిబాబు తనవంకే చూస్తున్నాడని తెలుసుకొని, జేబురుమాలుతో మొహాన్ని తుడుచుకోవడానికని, అది తీస్తూ.వాళ్ళఫోటో గ్రాఫర్‌చెయ్యి చూసి, అప్రయత్నాన్ని విరమించి-నిటారుగా కూర్చున్నాడు.

ఒక్క గంటలో సభ ముగిసింది.

నాయకులంతా నిష్క్రమించగనే - మిక్చర్ పొట్లాల్ని జ్ఞాపకం పెట్టుకున్న సభికులు .... పూర్ణానందాన్ని చుట్టుముట్టారు.

బ్రహ్మంగారు చూస్తూ వుండగా.... ఒక పదిహేను పొట్లాలదాకా ఇచ్చాడు పూర్ణానందం.

ఆయన కనుమరుగు కాగానే- "అడగో అటుప్రక్క స్వీట్స్ పొట్లాలు ఇస్తున్నారు. అవి తీసుకున్నాక ఇవీ...." అని ఒక ప్రక్కకు చూపించాడు.

అందరూ ఉత్సాహంగా అటుప్రక్కకు పరుగెట్టాడు.

అవకాశాన్ని వదులుకోకుండా— వెంటనే అ పొట్లాలను-ఒక పెద్ద సంచీలో వేసుకొని, ఇలాంటి వాటికోసం 'రెడీ'గా ఎదురు చూస్తుండే తన కొడుకు చేతికిచ్చి ఇంటికి పంపించేసి - తను మెల్లగా.... ఇంకొక ప్రక్కకు జారుకున్నాడు.

* * *

బ్రహ్మంగారు-చిట్టిబాబులు కూర్చున్న టాక్సీ, పురవీధులలో శరవేగంగా పోసాగింది.

"మొత్తానికి ఘటికుడివిరా" అని బ్రహ్మన్ని అభినందించాడు చిట్టిబాబు. అయినా అతని మనసులో పెద్ద అనుమాన మొకటి పీడించసాదింది! అడిగితే బాగోదని తన మనసులోనే సరిపెట్టుకున్నాడు.

"వారేయ్....ఎక్కడికిరా 'టాక్సీ పోయేది?"

స్టేషన్ దారిలోకి కాకుండా ఎక్కడికో పోతున్న టాక్సీని చూస్తూ బ్రహ్మన్ని ప్రశ్నించాడు చిట్టిబాబు.

"ఉండరా....దారిలో 'బషీర్‌బాగ్'లో కాస్త పనుంది. పదినిమిషాలు ఓపికపట్టు" అన్నాడు బ్రహ్మం . టాక్సీ ఆగింది.

"ఇప్పుడే వస్తానుండు" అని టాక్సీ దిగి-ఎదురుగా వున్న భవంతిలోకి అడుగు పెట్టాడు బ్రహ్మం.

"దాసు నిలయం" అన్న బోర్డు చూసి చిట్టిబాబు కాస్త ఆశ్చర్యపడ్డాడు.

పది నిమిషాలలో - చిరాకుతో-విసుగ్గా వచ్చి టాక్సీలో కూర్చున్నాడు బ్రహ్మం. ఏమిటన్నట్లు చూశాడు చిట్టిబాబు.

'ప్రచురించి తనకు అకింత మివ్వమని ఏడిస్తే ఇప్పుడు డబ్బు ఇవ్వడానికి అఘోరిస్తున్నాడు వెధవ. ఇంకో-ఇరవై రూపాయలు ఎక్కువిస్తే- ఆ కలర్సు - మిక్చరుకైనా....సరిపోయేది.... వెధవది....లాభం లేకపోయింది...." గొణుక్కోసాగాడు బ్రహ్మం.

చిట్టిబాబు సందేహం అడ్రసు లేకుండా ఎగిరిపోయింది. *